# సృష్టికి మూలం



డాక్టర్ పల్లవి గైనకాలజిస్ట్. ఇంకా పెళ్ళి కాలేదు.

ఆవిడ ఆ మధ్య బొంబాయి వెళ్ళి, పిండం నుంచి సూది ద్వారా అమ్నియోటిక్ ద్రవాన్ని తీసి పరీక్షించి గర్భస్థ శిశువు ఆడో మగో తెలుసుకునే విధానాన్ని నేర్చుకుని వచ్చింది. ఆ ప్రాంతంలో ఆ విధానాన్ని నేర్చుకున్న మొదటి డాక్టర్ ఆవిడే. ఇంకేం! మూడు గర్భస్రావాలూ, ఆరు బేంక్ బేలెన్సులూగా వర్థిల్ల సాగింది ప్రాక్టీసు. మొదటి కాన్పులోనే కొడుకును కనేసి అత్తగారి చేత, ఆయనగారి చేత 'శభాష్' అనిపించుకోవాలనే అతివలు, అన్ని కాన్పుల్లోనూ కొడుకుల్నే కనేసి కావాల్సినంత కట్నాన్ని పిండుకోవాలనుకునే ముదితలు, ముందు కాన్పులో ఆడపిల్లల్ని కన్న తల్లులు, అందరూ పల్లవినే ఆశ్రయించసాగారు. కేవలం రెండు వందల యాభై రూపాయల ఖర్చుతో పుట్టబోయే మైనస్ (ఆడ) ప్రాణిని మొగ్గలోనే త్రుంచేయ సాగారు.

* * *

డాక్టర్ పల్లవి ఈ మధ్యనే ప్రఖ్యాత న్యూరో సర్జన్ ప్రవీణ్‌ని పెళ్ళిచేసుకుంది. నెల తిరగ్గానే నెల తప్పింది. తన గర్భంలో రూపు దాల్చబోతున్నది ఆడపిల్లని తెలియగానే, అంతం చేయాలనుకుని, దగ్గరుండడానికి తల్లిని రప్పించుకుంది. విషయం విన్న ఆ తల్లి అంది కదా "నిన్ను కనే ముందు ఊహించకపోయినా, కన్న తర్వాత నేనలా అనుకుని వుంటే నువ్వెక్కడుండేదానివే అమ్మాయ్! అమ్మ కావడంలో ఆడదానికి వివక్ష కూడదు. తండ్రైనా, అన్నదమ్ముడైనా, కట్టుకున్న వాడైనా సుఖంగా వుంటే చూసి సంతోషించేవాడు మగవాడు. తల్లిగా, చెల్లిగా, కూతురుగా కష్టకాలంలో ఆదుకునేది ఆడదే! ఆడది లేని సృష్టెక్కడుందే? అంతెందుకు! ఈ సమయంలో మీ నాన్నగార్ని పిలిపించుకోక, నన్ను పిలిపించుకున్నావేం?" నోట మాటరాక డాక్టర్ పల్లవి విస్పష్టంగా తల్లినే చూడసాగింది.

—కె.వరలక్ష్మి

# హౌస్‌ఫుల్



"నీకెందుకూ, డబ్బు నే చూసుకుంటాను కదా, ఆ హీరోనే వుంచు... ఫ్లాపయిపోతుందనా భయం, నీ డబ్బు నీకందుతుంది కదా! నీ కెందుకు? మళ్ళీ మాటాడుకుందాం, సరే" ఫోన్ పెట్టేసి, మీసాలను సగర్వంగా దువ్వుతూ కారుకేసి నడిచాడు సదానందం.

అతనికి తెలుసు, ఫిల్మ్ ఇండస్ట్రీ తననేపు నిర్ఘాంతపోయి చూస్తుందని. ఫ్లాపయిన సినిమాల హీరోనూ, హీరోయిన్నూ, సంగీత దర్శకుడినీ పెట్టి ధైర్యంగా ఫ్లాపయ్యే సినిమా తీస్తున్నాడన్న కీర్తి పెరిగింది. ఎన్ని విస్కీ బాటిళ్ళు తలలెగిరితే, ఈ తలలో ఈ ఆలోచన వచ్చిందో ఎవరికిమాత్రం తెలుసు.

ఇండస్ట్రీలో అయిపులేకుండా పోయిన 'హరికృష్ణ'ను హీరోగా, 'కవిచిత్ర'ను హీరోయిన్‌గా ఎన్నుకోగానే అందరూ ఆడిపోశారు—

'స్క్రిప్ట్‌మీద నమ్మకం వుండే తీస్తున్నారా?' అని. అది విని నవ్వుకున్నాడు చిద్విలాసమూర్తి సదానందం. చక్రనాథ్‌ను సంగీత దర్శకుడిగా పెడితే ఆ సినిమా నాలుగురోజులైనా ఆడదన్నారు. పాతబస్తీలో నీళ్ళ వాన్ దగ్గిర గొడవలా వుంటుంది అతని వాయిద్యాల ఘోష. ఏ వాయిద్యమూ సరిగా వినపడదు. డైరెక్టర్‌కీ, మిగతా వాళ్ళకీ సినిమా విజయంపై నమ్మకం లేకపోయినా మా డబ్బు మాకు వచ్చింది కదా మాకెందుకని ఏమీ అనక ఊరుకొన్నారు. సినిమా పాటల రచయిత దగ్గర విస్కీ వాసనలా గుప్పుమంది ఈయన ఫ్లాప్ చిత్ర నిర్మాణ విషయం.

నిజానికి ఏదో పేద పెట్టుబడిదారయితే ఇంత సాహసించేవాడుకాదు. సదానందం ఆస్తి వివరాలు ఆ బీరువాలకు, బ్యాంకులకే తెలుసు. ఇలాంటివి మూడు తీసినా అతనికి చీమకుట్టినట్టయినా వుండదని అందరూ అనుకొన్న విషయమే. ఉదయమే అసిస్టెంట్ డైరెక్టర్‌తో డైరెక్టర్ చెప్పించాడు, టాప్ హీరో వ్రజేంద్ర దగ్గర కాళ్ళు పట్టుకొనయినా కాల్‌షీట్ సంపాదిస్తాను, హరికృష్ణను మార్చుద్దామని. అది వినగానే సదానందం అన్నాడు, 'మార్పు అంటూ జరిగితే మీ విషయంలోనే' అని. అది విన్న డైరెక్టర్ తారెత్తి మళ్ళీ ఆ మాటెత్తలేదు.

ఈజీ చైర్లో కూర్చుని పేపర్ చదువుతున్న సదానందం దగ్గరికి ఓ వార్త చేరింది, ఫిల్మ్ మూడొంతులు భాగం అయిపోవచ్చిందని. సదానందానికి ఏమీ తోచలేదు. తననుకొన్న ప్రకారం ఇంకా పొడిగిస్తే బావుంటుంది. ఏం చేయాలా అని ఆలోచిస్తున్న సమయాన అతని చిన్న కొడుకు దగ్గిరికి వచ్చాడు. అతని చేతిలో ముక్కలైన దేశం పటం వుంది. అది చెక్కతో చేసినది. అన్ని ముక్కలూ కలిపితే దేశంగా తయారవుతుంది. ఎంతో ప్రయత్నిస్తాడు, ఎంతకీ ఒక కొలిక్కి రావడంలేదు. ముక్కలు అర్థం పర్థం లేకుండా వున్నాయి. కోపంతో వాటిని నేలకేసి విసిరికొట్టాడు. విసుగ్గా తల కణతల వద్ద అదిరిపోతుంటే రుద్దుకుంటూ కూర్చున్నాడు. ఏడుస్తూ పోతున్న పిల్లవాడు, ముక్కలుగా వున్న దేశం రెంటినీ చూస్తుంటే బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. ఒక్క ఉదుటున లేచి ఫోనందుకున్నాడు. రింగ్ చేస్తుంటే కాలరెగరేయాలనిపించింది తన ఐడియాకి. "ఆ డైరెక్టర్....మొన్నోసారి స్టూడియోలో న్యూస్‌రీల్ ముక్కలు, వేరే చెత్త ఫిల్మ్ ముక్కలూ చూసాను. అవన్నీ మనం తీసే సినిమాలో అక్కడక్కడ అతికించి... ఆ.. అవునయ్యా.. అలాచేసి కలుపు. నాకు తెలుసు ఏమవుతుందో... అంతే... సాంతం వచ్చే సెయ్" ఫోన్ పెట్టేసాడు. డైరెక్టర్ ముఖం ఎలా వుంటుందో ఊహించగలరు. కాని తప్పదు మరి. తను నాలుగు రోజులు బొంబే వెళ్ళాలి.

*** *** ***

ఫోనందుకొని విలాసంగా కుర్చీలో కూర్చుని అడిగాడు సదానందం. "ఏమయింది? ఫిల్మ్ రిలీజ్ చేసారట కదా, అవును అందుకే నీకు ముందే అన్ని పవర్స్ ఇచ్చానుకదా! సరే రిజల్ట్ ఎలా వుంది?" సదానందం గుబురు మీసాలవెనక దరహాస వీచిక కదులుతుంది. ఈ సినిమా ఫ్లాపయితే ఇన్‌కంటాక్స్ అధికారుల వల నుండి జారొచ్చు. లెక్కల్లో గందరగోళం చేయవచ్చు. ఎంత రిస్క్ తీసుకున్నాడు తను రిజల్ట్‌కై. డైరెక్టర్ కనుక్కుంటున్నాడల్లే వుంది. ఆలోచిస్తున్నాడు సదానందం. "గుడ్ న్యూస్ సర్! రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణాల్లో నాలుగు రోజుల్నుండీ హౌస్‌ఫుల్ కలెక్షన్లతో నడుస్తోందట. వింటున్నారా సార్, ఎక్కడ చూసినా హౌస్‌ఫుల్ మాటే. నాకే మాట రావడంలేదు సార్! మాటలు వినపడడంలేదు సదానందానికి. అతని కళ్ళ ముందు వికటాట్టహాసంతో ఇన్‌కంటాక్స్ అధికారులు కనిపిస్తున్నారు. అలుక్కుపోయిన కళ్ళకు అంతా ఇన్‌కంటాక్స్ లెక్కలే కనిపిస్తున్నాయి.

— పి.మధుసూదన బ్రావా

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

రచయిత/ రచయిత్రి: _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

పేజీ నంబరు: _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _